



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రకృతి వనరులను ప్రయివేటుపరం చేయడం దుర్మార్గం

సిపిఎం జిల్లాకార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

ప్రకృతి వనరులను ప్రయివేటు పరం చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణఅన్నారు. రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ అధ్యక్షతన మడకశిరలోని ఉపాధ్యాయ భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పెనుకొండ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రభుత్వ రంగం లోనే కొనసాగాలన్న అంశంపై నిర్వహించిన ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణతో పాటు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. పెనుకొండలోని మెడికల్ కాలేజీనిపీపీపీ పద్ధతిన ప్రయివేటు శక్తులకు ఇవ్వాలని కూటమిప్రభుత్వం కుట్రపన్నిందన్నారు. 2023 లో గత ప్రభుత్వం ప్రారంభించి సుమారు 30 కోట్ల వరకు ఈ కళాశాల నిర్మాణానికి ఖర్చు పెట్టిందన్నారు. ఇంత ఖర్చు పెట్టి ప్రయివేటు శక్తుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల అవసరం చాలా ఉందన్నారు. కోవిడ్ వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలే ప్రజలను ఆదుకున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం 500కోట్ల రూపాయలు మంజూరు చేసి పెనుకొండలో మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇక్కడికి ప్రభుత్వ మెడికల్ కాలేజీ వస్తే సూపర్ స్పెషల్టీస్ గుండె, మూత్రపిండం, మెదడుకు, నాడి వ్యవస్థకు సంభందించిన బ్రాంచెస్ వస్తాయని ఇది పేద మధ్య తరగతి వారికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రకతి వనరులను ప్రైవేట్ పరం చేయడం అంటే ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడం, ప్రభుత్వం భాద్యతల నుండి తప్పు కోవడమేనని అన్నారు. పిపిపికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు జమ్మానిపల్లి మూర్తి, ఆర్‌పిఎ కేంద్ర కమిటీ సభ్యులు సోమన్న, డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు హనుమంతు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి మహాలింగప్ప, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, వైపిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ముదహిర్, మహేంద్రా, గణేష్ సాయి, దేవ, డివైఎఫ్ నాయకులు ముత్యాల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సాగునీటి లెక్కల్లో ఎక్కడా పొంతన కుదరడం లేదు. అవి నీటి మీద రాతల చందాన నీటి మీద లెక్కల్లాగా మారాయన్న విమర్శ ఉంది. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలోనూ నేతలు బాగుందని చెప్పకునేందుకు ప్రయత్నించారే తప్ప వచ్చిన నీటి వినియోగంపై ఎక్కడా చర్చ జరిగిన దాఖలాల్లేవు. అధికారులు కూడా నేతలను మెప్పించే విధంగా లెక్కలు చూపినట్టు ఆరోపణలొస్తున్నాయి. ఎందుకంటే వారు చెబుతున్న లెక్కలకు. క్షేత్ర స్థాయిలోనున్న దానికి పొంతన లేదు.

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి



పిఎబిఆర్‌లో ఉన్న నీటి నిల్వ

నీటి మీద లెక్కలు..

హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి పిఎబిఆర్‌కు 6 టిఎంసిలట..
నిల్వ ఉన్నదే 5.44 టిఎంసిలు
ఐఎబిలో అధికారుల లెక్కల్లో తేడాలు

హంద్రీనీవా నుంచి పెన్నహోబిలం బ్యాలెన్సింగు రిజర్వాయరుకు 6.182 టిఎంసిల నీరు ఇచ్చామని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు. ఇది కాకుండా హెచ్ఎల్ఎంసి నుంచి 2.746 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. అయితే ఆ డ్యామ్‌లో నీటి నిలువ ప్రస్తుతమున్నది 5.44 టిఎంసిలు మాత్రమే. దీని నుంచి ఇతర పంటలకేమైనా ఇచ్చారంటే అదీ లేదు. ఇటీవలి కాలంలో కొద్ది రోజులు విద్యుత్ ఉత్పత్తికి వాడారు. 220 క్యూసెక్కులు మాత్రమే ఈ డ్యామ్ నుంచి అవుట్‌ఫ్లో ఉన్నాయి. ఇలాగుంటే ఈ డ్యామ్‌లో గతేడాది సంబందించి నీటి నిలువలున్నాయి. అంటే తుంగభద్ర డ్యామ్, ఇటు హంద్రీనీవా నీళ్ల జిల్లాకు రాకముందే అంటే జులై 17కు ముందే పిఎబిఆర్ డ్యామ్‌లో 1.92 టిఎంసిల నీళ్ల నిలువ ఉంది. దాదాపు రెండు టిఎంసిల నీళ్ల ఉన్నాయి. ఇప్పుడు తుంగభద్ర, అటు హంద్రీనీవా నుంచి ఇచ్చిన ఆరు టిఎంసిలు కలిపితే మొత్తం ఈ డ్యామ్‌లో ఎనిమిది నుంచి తొమ్మిది టిఎంసిల నీళ్ల నిలువ ఉండాలి. కాని ప్రస్తుతం ఈడ్యామ్‌లో 5.44 టిఎంసిలు మాత్రమే నిలువ ఉంది. ఈ లెక్కల్లో తేడాలు ఎందుకున్నాయన్నది తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

మిడ్‌పెన్నార్ పరిస్థితి అదే తీరు

జిల్లాల్లో హెచ్ఎల్ఎంసిపైనున్న మరో ప్రాజెక్టు మిడ్ పెన్నార్. దీని పూర్తి నిలువ సామర్థ్యం 5.17టిఎంసిలయితే ఇప్పటి వరకు నిలువ ఉన్నది 2.86 టిఎంసిలు మాత్రమే. అంటే 55 శాతం మాత్రమే నీరు నిలువ ఉంది. దీని నుంచి 980 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉంది. ఈ డ్యామ్‌లోనూ సీజన్ ఆరంభానికి ముందు 0.39 టిఎంసిలే నీరు ఉండేది. ఇక్కడ మాత్రం 2.50 టిఎంసిల వరకు హెచ్ఎల్‌సి నీరు వచ్చినట్టు కనిపిస్తోంది. అయితే పూర్తిగా ఇప్పటి వరకు ఇచ్చిన 16 టిఎంసిల్లో ఎక్కడా వినియోగంపై సరైన స్పష్టతను సాగునీటి సలహా మండలి సమావేశంలో తేల లేదు.

హెచ్ఎల్‌సి నీటి వినియోగంపైనా అనేక సందేహాలు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఈ ఏడాది 24 టిఎంసిలు కేటాయించారు. ఇందులో 14.068 టిఎంసిల్లో పది టిఎంసిలకు తాగునీటి అవసరాలకు కేటాయించారు. ఈ కేటాయించిన దానిలో 7.847 టిఎంసిలు ప్రవాహ నష్టం కింద లెక్కవేశారు. ఇవిపోనూ 9.481 టిఎంసిలు సాగునీటికి, 6.740 టిఎంసిలు తాగునీటికి అన్నారు. ఇందులో ఇప్పటి వరకు 16 టిఎంసిలు నీళ్ల జిల్లాకు వచ్చాయి. ఇక ఎనిమిది టిఎంసిలు మాత్రమే రావాల్సి ఉంది. ఈ నీళ్ల జనవరి ఆఖరు వరకు రావాల్స ఉంటుంది. ఇప్పుడొస్తున్న ప్రవాహం ప్రకారమైతే మరో 40 రోజుల్లో జిల్లాకు వచ్చే నీరు ఆగిపోనుంది. పంటల ప్రకారం చూస్తే జనవరి ఆఖరు వరకు నీరు అవసరమవుతుంది. దీన్ని ఏ రకంగా సర్దుబాటు చేయాలన్నది నీటిపారుదల అధికారులు తేల్చాల్సుంది.

నీటి లెక్కల్లో తేడాలెందుకు..?

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా వచ్చిన 17 టిఎంసిలు, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా వచ్చిన ఆరు టిఎంసిలు కలిపి మొత్తం 23 టిఎంసిలొచ్చాయి. ఇందులో ఈ నీటి వినియోగంపై సరైన స్పష్టత లేదు. అందుకే సాగునీటి సలహామండలి సమావేశంలోనే తేడాలు గమనించిన నేతలు మరోమారు అధికారులు సమావేశమై నిర్దిష్టమైన ప్రణాళికతో రావాలని సూచించారు. అనంతపురం జిల్లా ప్రాజెక్టుల్లో అత్యంత ప్రధానమైనది పిఎబిఆర్ డ్యామ్. ఈ డ్యామ్‌కు వచ్చిన నీటి లెక్కల్లో తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముందుగానున్న 1.92 టిఎంసిలు, హంద్రీనీవా నుంచి ఇచ్చిన ఆరు టిఎంసిలు, ఇప్పుడు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచి వచ్చిన నీరు కలిపితే తొమ్మిది టిఎంసిల నీళ్ల ఆ డ్యామ్‌లో ఉండాల్సుంది. కాని సగమే ఉండటం గమనార్హం.

రానున్న నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బంగాళాఖాతంలో అల్పపీడనం 'మంథా' ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ సూచించిన నేపథ్యంలో రానున్న నాలుగు రోజులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి వర్షాలు, విపత్తు నిర్వహణ పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులు, ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. రానున్న నాలుగు రోజులు ఎంతో కీలకం అన్నారు. 'మంథా' ద్రోణి వల్ల జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా శాఖలలో ఉద్యోగులు అందరూ అందుబాటులో ఉండే విధంగా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో పాత భవనాలను గుర్తించి అందులో పిల్లలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తూ ఏలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా కావలసిన ఏర్పాట్లను, కావలసిన పరికరాలను, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని పోలీసు, అగ్నిమాపక అధికారులకు ఆదేశించారు. ప్రతి శాఖలో నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో ప్రత్యేక టీములుగా ఏర్పాటు చేసి ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా వారి సెల్ నెంబర్లను కంట్రోల్ రూమ్ నందు నమోదు చేసి ఉంచాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వాటిని వెంటనే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాలకు సంబంధించి ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు జిల్లా డివిజన్ మండల స్థాయి ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ లని సంప్రదించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.



పాంచజన్య పాఠశాలను పరిశీలిస్తున్న అధికారి

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ లాజర్

ప్రజాశక్తి-హిందూపురం

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం జరుగుతుందని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లాజర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన డివైఇఒ జాన్ రెడ్డప్ప, ఎంఇఒ గంగప్పలతో కలిసి పరిశీలించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, అజీజియా, దీప్తి, చైతన్య నారాయణ, బాలయేసు, బాలికల ఉన్నత పాఠశాల, కొట్నూరు ఉన్నత పాఠశాల, ఓరియంటల్, ముస్తఫా స్కూల్, బసవన్నపల్లి ఉన్నత పాఠశాల, వేళాంగిణి మాత, నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, పాంచజన్య బ్రిలియంట్ తదితర పాఠశాలలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో పరీక్ష నిర్వహణకు అవసరమైన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎఫ్ రాష్ట్ర నాయకులు సిద్దగిరి శ్రీనివాసులు, ఓరియంటల్ హెచ్ఎం పెన్నోబులం పాల్గొన్నారు.

రూ.7కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కు అభివృద్ధికి శ్రీకారం

మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలం రాజేశ్వరి కాలనీ సమీపంలో ఉన్న ఎంఎస్ఎంఇ పార్కు అభివృద్ధికి రూ.7 కోట్లతో శ్రీకారం చుడుతున్నామనిరాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖమంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె స్థానిక రాజేశ్వరి కాలనీ సమీపంలో ఉన్న ఎంఎస్ఎంఇ పార్కులో అభివృద్ధి పనులు శనివారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని, యువత తమ సొంతూర్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు రాష్ట్రానికి తరలి వస్తున్నాయన్నారు. కేవలం పెద్ద పరిశ్రమల ఏర్పాటుతోనే సరిపెట్టకుండా రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సైతం ప్రోత్సహిస్తున్నారన్నారు. యువత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కూటమి ప్రభుత్వం సకాలంలో అనుమతులిస్తోందని వెల్లడించారు. అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తోందన్నారు. పెనుకొండలో 68 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి విడతగా 20 ఎకరాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయల కల్పనకు రూ.7 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు కేవలం 21 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులో పెట్టుబడిదారులకు ప్రభుత్వం భూములు కేటాయిస్తుందన్నారు. తమకు కేటాయించిన స్థలాల్లో రెండేళ్లలో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని, ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వైసీపీవి చీప్ రాజకీయాలు : చేయని మంచిని చేసినట్లు చెప్పుకోడానికి వైసీపీ నాయకులు చీప్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కియా పరిశ్రమను తీసుకొచ్చింది సీఎం చంద్రబాబు అని, అయితే వైసీపీ నాయకుల మాత్రం తామే తీసుకొచ్చామని డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. విశాఖలో ఏర్పాటు కాబోతున్న గూగుల్ డేటా సెంటర్ ను తామే తీసుకొచ్చినట్లు జగన్, వైసీపీ నాయకులు నిసిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఎపిఐఐసి జెడ్ఎం నాగకుమార్, దేవకాంతమ్మ, డిడిఒ రామకృష్ణయ్య, తహశీల్దార్ స్వాతి. ఎంపీడీవో నరేష్‌కృష్ణ, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర యాదవ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి చిన్నప్పయ్య, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు మండల పార్టీ కన్వీనర్ ఈశ్వర ప్రసాద్ త్రివేంద్రనాయుడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడకు నూతన శోభ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోలాపురం పారిశ్రామిక వాడల్లో కనీస సౌకర్యాలు లేక అందరూ ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యలను ప్రజాశక్తి ప్రత్యేక కథనం రూపంలో వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించారు. తొలుత పారిశ్రామికవాడలో విద్యుత్ దీపాలను అమర్చి వెలుగులు తీసుకొచ్చారు. శనివారం ఏపీఐఐసీ అధికారులు, పారిశ్రామికవేత్తలు సంయుక్తంగా పారిశ్రామిక వాడను శుభ్రం చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ అధికారి ఈశ్వర్ మాట్లాడుతూ త్వరలో పారిశ్రామిక వాడలో గుంతలను పూడ్చి నూతన రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. దీనిపై ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపడం జరిగిందన్నారు. త్వరలో పారిశ్రామిక వాడకు నూతన వెలుగులను తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఏపీ శ్రీనివాసరావు, పారిశ్రామిక వాడ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి, ఏపీఐఐసీ సిబ్బంది శంకర్, అరుణ్, తుమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.



పారిశ్రామిక వాడలో మొక్కలు నాటుతున్న దృశ్యం

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం పరిగి మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమలు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక సమాజం, కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే అందులో మహిళల పాత్ర ఎంతో ప్రముఖంగా ఉంటుందన్నారు. మహిళలపై ఎంతో నమ్మకంతో పారిశ్రామికవేత్తలు విరివిగా అవకాశాలు కల్పిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి సాధించాలని చెప్పారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కల్పించుకుని తరచూ జరిగే సమావేశాల్లో వీటిపై చర్చించాలన్నారు. ఇందులో భాగంగా ప్రతియేటా తరహాలోనూ పరిశ్రమలో పనిచేసే మహిళల కుటుంబంలోని విద్యార్థులకు అందించే ఆర్థిక సహకారాన్ని 110 మంది విద్యార్థులకు రూ.9 లక్షలలో అదనపు జిల్లా జడ్జి చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సురేష్, సీనియర్ మేనేజర్ శామ్యూల్, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతోషి కుమారి, నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు, పారా లీగల్ వాలంటీర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సప్తగిరి'లో ఫ్రెషర్స్‌డే వేడుకలు

హిందూపురం : పట్టణంలోని సప్తగిరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించి, ఘనంగా ఆహ్వానం పలికారు. శనివారం కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రత్యేక స్థాయిలో నైపుణ్యత అవసరమని అన్నారు. అనంతరం బిజినెస్ ఈవెంట్స్‌లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సప్తగిరి కళాశాల ఏవో గంగిరెడ్డి, డిగ్రీ ప్రిన్సిపల్ శ్రీనాథ్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ మంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో అధికార బలమున్న వారు వాటిని దక్కించుకుని సులభంగా కోట్లు సంపాదించవచ్చునన్న ఉద్దేశ్యంతో అందరి కళ్లు భూములపైనే పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో వరుసగా భూములకు సంబంధించిన అంశాలే వెలుగులోకి వస్తున్నాయి. వీటి వెనుక అధికారపార్టీ నేతల ప్రమేయమున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయంలోనూ ఇటువంటివే వచ్చినప్పటికీ ఇప్పుడు మరింతగా పెరిగినట్టు కనిపిస్తున్నాయి. ఈ వారంలో అనంతపురం రూరల్ మండలంలో పరిధిలోని పాపంపేట గ్రామం పరిధిలోని ఇనామ్ భూముల వ్యవహారం రాష్ట్ర స్థాయిలోనే చర్చనీయాంశమైంది. 1953 నాటికి ఇనామ్ భూములు కలిగిన వారి వారసులు ఇప్పుడొచ్చి భూములు తమవేనని చెబుతుండటంతో గమనార్హం. దానికి సంబంధించి జిపిఎ అధికారపార్టీకి సంబంధించిన నేతలకు ఇవ్వగా వారు ఖాళీ జాగాల్లో ఈ భూములు తమవేనని బోర్డులు పాతిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఇనామ్ భూములకు సంబంధించి ఏ రకంగా పాత వారసులకు సంబంధించినవ్వది చర్చ నడుస్తోంది. వాస్తవానికి 1955లోనే ఇనామ్ భూముల రద్దు చట్టమొచ్చింది. అంటే ఎవరైనా ఇనామ్ భూములు పెద్దఎత్తున కలిగున్నట్లయితే వాటిని రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఉంది. అయితే సాగులో ఎవరైనా ఉంటే వారు రైతువారి పట్టాలు పొందాల్సి ఉంది. ఆ రైతు వారి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఇవ్వాలని ఉంది. కాని ఇప్పుడు పాపంపేట గ్రామం పరిధిలో చూసినప్పుడు రాచూరి వెంకట కిరణ్ అనే వ్యక్తి తమ వారసుల నుంచి వంద ఎకరాలు అలాగే వచ్చినట్టు, మధ్యలో ఇతరులు వచ్చి అందులో ఉంటున్నట్టు సమర్థించుకుంటున్నారు. జిపిఎ సమయంలోనూ రిజిస్ట్రేషన్ అధికారులు ఏ మాత్రం పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలున్నాయి. ఎప్పుడో జిపిఎను రద్దు చేసామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇప్పుడు చెబుతున్నారు. అయితే రెవెన్యూ చట్టాల ప్రకారం చూసుకున్నా ఇంత పెద్దఎత్తున భూమి ఒక వ్యక్తికి ఇప్పటికీ ఎలాగుందన్న ప్రశ్న మాత్రం ఉత్పన్నమవుతోంది. ఎందుకంటే 1975లో ల్యాండ్ సీలింగ్ యాక్టును ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం తరి భూమి అయితే పది ఎకరాలు, మెట్ట భూమి అయితే 25 ఎకరాలకు మించి భూమి ఉండటానికి వీల్లేదు. అంతకుపైనుండే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారమైనా రాచూరి వెంకటకిరణ్‌కు వందల ఎకరాలపై హక్కు ఏ విధంగా వస్తుందన్న ప్రశ్న ఉత్పన్నవుతోంది. ఈ రకంగా రెండు చట్టాలున్నా రాచూరి కుటుంబ వారసులకు ఏ రకంగా వందల ఎకరాలపై హక్కుందని వాదనపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతకు మునుపు ఎకరం భూమిని యజమానులకు తెలియకుండా డబుల్ రిజిస్ట్రేషన్ అవడం, బాధితులు ముఖ్యమంత్రికి, నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి అది డబుల్ రిజిస్ట్రేషన్ అని తేల్చారు. ఇలా వరుస భూముల వ్యవహారంపై విపక్ష పార్టీలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. పాపంపేటకు సంబంధించి పరిరక్షణకు అన్ని పార్టీలతో కలిపి పరిరక్షణ కమిటీ ఏర్పాటైంది. ఇది రాజకీయంగానూ దుమారం రేగుతోంది. ఈ భూముల కాజేయడం వెనుక రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల కుటుంబ సభ్యుల పాత్ర ఉందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇక ప్రకాశ్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు తమపై చేస్తున్నారని టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్ ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఇలా ఇద్దరి మధ్య రాజకీయవేడిని రాజేస్తున్నాయి.



వేధిస్తున్న రెవెన్యూ సమస్యలు.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని 13 పంచాయతీల్లో రెవెన్యూ సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రోజూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా భూ సమస్యలపై అధికారులు అవలంబిస్తున్న వైఖరి పట్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగులో ఒకరు ఉంటే వన్-బి ఇంకొకరి పేరుతో వస్తోంది. ఇలాంటి సమస్యలు మండలంలో వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై రైతులు వీఆర్వోలు, సర్వేయర్, ఆర్ఐతో పాటు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో పనిచేసిన వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్ఐలు ఇష్టారీతిన సంబంధం లేని వ్యక్తుల పేర్లను రికార్డుల్లో చేర్చినట్లు విమర్శలున్నాయి. ఈ విషయంపై అధికారుల తీరుపై పలు అనుమానాలు ఉన్నాయి. పి. కొత్తపల్లికి చెందిన శ్రీనివాసులుకు చెందిన భూమి ఇతరుల పేరుపైకి మార్చారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని బాధితుడు రెవెన్యూ

ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు

కార్యాలయం చుట్టూ 3 నెలలుగా తిరుగుతున్నాడు. ఇక మద్దమడుగు పంచాయతీకి చెందిన మహిళా రైతు రెడ్డెమ్మకు భూమి కూడా వన్‌బిలో సంబంధం లేని వ్యక్తుల పేర్లపై ఉంది. గతంలో పనిచేసిన సర్వేయర్, మండలానికి చెందిన ఓ వ్యక్తి తో లోపాయికారి ఒప్పందంతో ఇలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో డబ్బులు చేతులు మారినట్లు విమర్శలున్నాయి. ఈ సమస్యపై బాధితులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమస్య తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం కన్పించడం లేదని బాధితులు వాపోతున్నారు. అదే విధంగా వాదనపల్లి ఖాసీమ్‌కు చెంది న 1.25 ఎకరాల భూమి కమ్మవారి పల్లికి చెందిన ఇతరుల వ్యక్తుల పేర్లు మీద వన్ బి వస్తోంది. బాధిత రైతు అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్నా డు. ఆయన తన సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా న్యాయం జరగలేదు. అదే విధంగా పూర్వాయి పంచాయతీకి చెందిన రాంప్రసాద్‌కు చెందిన భూమి ఇతరుల పేరు మీద వస్తోందని బాధితుడు దాదాపు రెండేళ్లుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సమస్య పరిష్కారం కాలేదు. దీంతోఆయన చివరికి సివిల్ కోర్టును ఆశ్రయించాడు. పల్లెవాండ్లపల్లికి చెందిన గోవిందమ్మ అనే మహిళా రైతు సాగులో ఉన్న భూమికి సంబంధం లేని వ్యక్తుల పేర్ల వన్‌బిలో వస్తున్నాయి. ఈ విషయంపై బాధితులు సమస్యను పలుమార్లు ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కన్పించలేదు. ఇలా మండలంలో వందల సంఖ్యలో రైతు సమస్యలు న్నాయి గతంలో రీ సర్వే చేసినప్పుడు పిఎం కిసాన్ రైతు భరోసా కోసం సంబంధం లేని వ్యక్తుల పేర్లను ఏదో ఒక సర్వే నెంబర్లు చూపించి వారి మధ్య తగాదాలను సృష్టించారని రైతులు విమర్శిస్తున్నారు. రెవెన్యూ సమస్యపై ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని బాధిత రైతులు ఈసందర్భంగా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : మంత్రి



మొక్కనాటి నీరు పోస్తున్న రాష్ట్ర మంత్రి సవిత, అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

భావితరాలకు మనం అందించాల్సిన వారసత్వ సంపద పర్యావరణం అని, ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని రాష్ట్ర మంత్రి సవిత పిలుపునిచ్చారు. మండలంలోని అడదాకులపల్లి గ్రామంలో 3 ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి శనివారం మంత్రి శ్రీకారం చుట్టారు. మంత్రి మాట్లాడుతూ చెట్లతోనే మానవళి మనుగడ సాధ్యమని, హరితాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి అందరూ దూరంగా ఉండాల న్నారు. ప్రభుత్వం పచ్చదనం పెంపుదలకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ఎవరైనా పర్యావరణానికి నష్టం కలిగేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పశువులకు గోకులం షెడ్ల నిర్మాణం చేశామన్నారు. త్వరలోనే అర్హులందరికీ ఇళ్లు మంజూరు ఇస్తామన్నారు. అడదాకులపల్లి గ్రామంలో త్వరలోనే ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, మరిన్ని సీసీ రోడ్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పిడి శ్రీలక్ష్మి, ఎపిడి శివానందనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ ఈశ్వరప్రసాద్, రంగ నాయకులు, ఉపేంద్రనాయక్, కురుబ సంజప్ప, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ సుదర్శన్, బీట్ ఆఫీసర్ గౌతమి మాట్లాడుతూ చెట్లతోనే మానవ మనుగడ అన్నారు. ప్రతి విద్యార్థి ఓ మొక్క నాటి అది వృక్షంలా పెంచేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ అహ్మద్, ఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు ఎం.శ్రీలేఖ, డి.శివన్న, కె.రవికుమార్, ఆర్ఆర్‌సి నోడల్ అధికారి విజయప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలు, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎన్నికల హామీలు అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతి గ్రామానికి రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు అందించడమే ప్రధాన ధ్యేయమన్నారు. మండలంలోని డి.చెర్లోపల్లి పంచాయతీ పరిధిలోని పత్యాపురం నుంచి తండా వరకూ రూ. 85 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బిటి రోడ్డును శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. పత్యాపురం, తండా ప్రజల చిరకాల కోరిక మేరకు బిటి రహదారి నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గం లోని ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, సర్పంచి రమాదేవి, కూటమి నాయకులు భాస్కర్, గోనుగుంట్ల నారాయణరెడ్డి, నారాయణస్వామి, ఉప సర్పంచి సత్యం, చంద్రశేఖర్, అశోక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకావిష్కరణలో మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఆర్డీవో మహేష్, అధికారులు

అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు



ఎక్సైజ్ సురక్ష యాప్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిసి, అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా, బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య హెచ్చరించారు. ఆయన శనివారం పట్టణం లోని జిల్లా కార్యాలయంలో అన్ని స్టేషన్ల సిఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. షాపులు, బార్లలో ప్రతి మద్యం బాటిల్‌ను ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే విక్రయించాలన్నారు. ఈ యాప్ పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు నకిలీ మద్యంపై అపోహలు తొలగించాలన్నారు. బెల్ట్ షాపు లను పూర్తిస్థాయిలో నియంత్రించాలని, నిర్వాహకులను బైండోవర్ చేయాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసిన లైసెన్స్‌దారులపై కఠిన చెర్యలు తప్పవన్నారు. అక్రమంగా మద్యం జిల్లాలోకి రవాణా కాకుండా నిఘా పెంచాలని, రూట్ వాచ్ చేయాలని ఆదేశించారు. అధికారి గోవింద్ నాయక్, సూపరింటెండెంట్ నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఎక్సైజ్ సురక్ష యాప్ కరపత్రాలను ఆవిష్కరించారు. వినియోగదారులకు యాప్‌పై అవగాహన కల్పించారు.


ధర్మవరం రూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. ఆయన పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏ-ఫోర్ బ్రాందీ షాపును తనిఖీ చేసి యాప్ పనితీరుపై ఆరా తీశారు. ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసిన తర్వాతనే విక్రయించాలన్నారు. కర్నాటక మద్యం, బెల్ట్ షాపులు, నాటుసారాను పూర్తిగా నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సిఐ చంద్రమణి, సిబ్బంది ఉన్నారు.

28న వైసిపి నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీ పట్టణంలో వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైసిపి పాలనలో జగన్ కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేయించగా కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేట్ సంస్థలకు అప్పగించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టే నిరసన ర్యాలీలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ముదిగుబ్బ : వైసిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జయమ్మ, ఉప సర్పంచి లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అర్థ రహిత చర్య అన్నారు. ఈ విధానంతో పేద పిల్లలు వైద్య విద్యకు, పేదలు ప్రభుత్వ వైద్యానికి దూరం అవుతారన్నారు. వెంటనే పిపిపి విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీదేవి, రామాంజి పాల్గొన్నారు.



ముదిగుబ్బలో కరపత్రాలు పంచుతున్న వైసిపి నాయకులు

బత్తలపల్లి : మండలంలోని గుమ్మల కుంట గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య రంగాన్ని వ్యాపారం చేయవద్దంటూ సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌భూపాల్‌రెడ్డి, చిన్నశివారెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి, రామాంజి, నారాయణస్వామి, శివారెడ్డి, తదితరులు పాలొన్నారు.



సిఐ శేఖర్‌కు ప్రశంసా పత్రం ఇస్తున్న ఎస్పీ

సిఐ శేఖర్‌కు ఎస్పీ ప్రశంస

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలో నేరాలను నియంత్రించినందుకు గానూ శనివారం పుట్టపర్తిలో సిఐ శేఖర్ ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. పుట్టపర్తిలో ఎస్పీ పోలీస్ శాఖ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసులు పరిష్కరించినందుకు సిఐ శేఖర్‌కు ఎస్పీ ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నేరాలను అరికట్టడంలో పోలీస్ అధికారులు బాధ్యతగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించాలని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సూచించారు. పట్టణంలోని సాయి ఆరామంలో శనివారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికా రులు పాల్గొన్నారు. ఎస్పీ వివిధ కేసులపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. క్రైమ్ రేట్ తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నేరం చేసిన వారికి సాక్ష్యాలతో శిక్ష పడేలా చూడాలన్నారు. విద్యాసంస్థలు, గ్రామాలకు తరచూ వెళ్లి ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, సీసీ కెమెరాల ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తులు, దొంగలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాత్రి వేళ గస్తీలు పెంచి చోరీలను నియంత్రించాలన్నారు. విజిబుల్ పోలిసింగ్ పెంచడంతో పాటు ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలన్నారు. సైబర్ నేరాలు, మహిళా భద్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పిపిలు, ఎపిపిలు పలు కేసులపై న్యాయ సలహాలు సూచనలు చేశారు. కేసుల ఛేదింపులో ప్రతిభ చూపిన సిఐలు, ఎస్ఐలు, ఎస్‌జిజి టీం, పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు, నగదు రివార్డ్స్ అందజేసి అభినందించారు. పోక్సో కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చేసిన పిపి లక్ష్మీనారాయణను సత్కరించి సిఐ ఇస్మాయిల్‌కు ప్రశంసా పత్రం అందజేశారు.

నూతన గృహనిర్మాణాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యమనిఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. కావున సొంత స్థలం కలిగిన ప్రజలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద ఇంటి నిర్మాణం కోసం సచివాలయ సిబ్బంది ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, అర్హులైన కొత్తవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు ఈ విషయాన్ని వివరించి వారి సహకారం తీసుకోవాల న్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు సమాచారం చేరేలా చూడాలని పంచాయతీ అభివృద్ధి అధికారులకు సూచించారు. ఈ పథకం కింద గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం కేటాయిస్తామన్నారు.

జవాను భౌతికకాయానికి మంత్రి సవిత నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాను శ్యామ్‌ప్రసాద్(42) పంజాబ్‌లో విధులు నిర్వహిస్తూ శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. జవాను భౌతికకాయాన్ని శనివారం స్వగ్రామం శెట్టిపల్లికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సవిత శెట్టిపల్లి గ్రామం వెళ్లి జవాను భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అలాగే జవాను కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి జాతీయ జెండాను అందించారు. మంత్రి వెంట తహశీల్దార్ స్వాతి, సిద్ధయ్య, అధికారులు, కూటమి నాయకులు , కార్యకర్తలు ఉన్నారు.



జవాను భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, పక్కన గుండుమల తిప్పేస్వామి

విగ్రహావిష్కరణ జయప్రదం చేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మండలంలోని బేగార్లపల్లి గ్రామంలో నూత నంగా ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలను ఈ నెల 27వ తేదీ ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం టిడిపి మండల కన్వీనర్లు, ఎస్సీ సెల్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విగ్రహా విష్కరణ కార్యక్ర మానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 15 మంది ఎమ్మెల్యేలు హాజరవు తారన్నారు. కావున ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు, కార్యకర్తలకు దేశానిర్దేశం చేశారు.

పంట నమోదుకు 30 గడువు

గాండ్లపెంట : రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ నెల 30వ తేదీ లోపు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సయ్యద్ షాదాబ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి పంట నమోదు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇఒలు భరణి, రాజేష్, ఫైరోజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

3న కంటి ఆసుపత్రి ప్రారంభం

మడకశిర రూరల్ : అంతర్జాతీయ కంటి ఆసుపత్రిగా పేరొందిన ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని నీలకంఠాపురంలో గ్రామంలో నూతనంగా శాంత, జయరాం నేత్ర వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఆసుపత్రిని నవంబర్ 3వ తేదీ ప్రారంభిస్తున్నట్లు సిడబ్ల్యుసి సభ్యులు ఎన్. రఘువీరారెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

28న కంటి వైద్య శిబిరం

గుడిబండ : స్థానిక పిహెచ్‌సిలో ఈ నెల 28వ తేదీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాత్రికేయులు షబ్బీర్ తెలిపారు. మండలంలోని మద్దనకుంట గ్రామానికి చెందిన అస్మత్ ఉన్నీసా, అబ్దుల్ హమీద్ ఖాన్ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎ.షబ్బీర్, కె.షబానా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎపి ఆర్‌జెసి విద్యార్థులు

పరిగి : ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కొడిగెనహళ్లి ఎపి గురుకుల కళాశాల విద్యార్థులు 6 కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. వీరు నవంబర్‌లో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని ప్రిన్సిపల్ జె.అనిల్‌కుమార్, వ్యాయామ అధ్యాపకుడు సి.శ్రీనివాసరెడ్డి, ఇతర అధ్యాపకులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎవిఎఎస్ యాప్‌పై అవగాహన

గోరంట్ల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎవి ఎఎస్ యాప్‌పై గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ గణేష్ మాట్లాడుతూ కొత్తగా ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుని స్థలం వద్ద ఎవి ఎఎస్ యాప్‌లో ఫొటో తీయాలన్నారు. లబ్ధిదారుని దరఖాస్తు కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎవి ఎఎస్ యాప్ ద్వారా ఇంజినీర్ అసిస్టెంట్లు సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, బాలకృష్ణచౌదరి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

గుడిబండ : మండలంలోని మద్దనకుంట పాఠశాలలో శనివారం హెచ్‌ఎం నరసింహమూర్తి అధ్యక్షతన బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, కొత్తగా వచ్చిన వారికి స్వాగత సన్మాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ పని చేస్తూ బదిలీపై మరో పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు పోతిరెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, శ్రీహరి, కుమార్, ఈ పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు వీరాంజనేయులు, లీలావతి, కుళ్లాయమ్మలను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు షబ్బీర్, ఎస్ఎంసి ఛైర్మన్ వీరముద్దప్ప, మూడ్ల గిరియప్ప, క్రిష్టప్ప, నాగప్ప, వీరకేతప్ప, ఉపాధ్యాయులు అరుణ, శివారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కార్యవర్గం ఎన్నిక

ధర్మవరంరూరల్ : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఎపిఆర్ఎస్ఎ ధర్మవరం రెవెన్యూ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్డీవో కార్యాలయ ఏఓ ఖతిజున్ కుబ్రా మాట్లా డుతూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం హర్షణీయమన్నారు. అధ్యక్షుడిగా తహశీల్దార్ సురేష్ కుమార్, డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఖతిజూన్‌కుబ్రా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా షణ్ముఖ్‌కుమార్ యాదవ్, సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులకు అందులో బాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుక తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.


అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

గుడిబండ : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవతో మండలం లోని వివిధ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 3.40 కోట్లు మంజూరైనట్లు సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. గుడిబండలో శనివారం వారు విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ ఆ నిధుల్లో వద్రహట్టి గ్రామం వద్ద కల్వర్టు నిర్మాణానికి రూ. 50 లక్షలు, నాచేపల్లి-కరితిమ్మనహళ్లి సీసీ రోడ్డుకు రూ. 80 లక్షలు, మోరుబాగల్-ఉప్పార్లపల్లి సీసీ రోడ్డుకు రూ. 20 లక్షలు, బాలేపల్లి-కర్నాటక సరిహద్దు వరకూ తారు రోడ్డు నిర్మాణం కోసం రూ. కోటి, ఇటికేపల్లి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుకు రూ. 20 లక్షలు, మరికొన్ని చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 40 లక్షలు ఖర్చు చేస్తామన్నారు. వారితో పాటు నాయకులు శివకుమార్, మంజునాథ్, రాజు, భీమరాజు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుట్టపర్తి రూరల్ : నవంబర్ 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో మండల స్థాయి వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఎంఇఒ-2 బొల్లె ప్రసాద్ తెలిపారు. వ్యాసరచనలో మనస్విక్రు), సఫియా, సాత్విత, వక్తృత్వ పోటీల్లో మేఘన, చైతన్యలక్ష్మి, సాయి ప్రతిభ చాటారన్నారు. క్విజ్ పోటీల్లో వెంగళమ్మచెరువు గ్రూపు, యనమలపల్లి, పెడపల్లి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. న్యాయ నిర్ణేతలుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటరత్నం, యనమలపల్లి హెచ్‌ఎం సునీత, సునంద వ్యవహరించారు.

కొత్తచెరువు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో జస్వంత్‌రెడ్డి, లాస్య, వై.సంతోష్, వక్తృత్వ పోటీల్లో షణ్ముఖకుమార్, జి.నిషిత, నీలారెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ఎంఇఒలు సోమశేఖర్‌నాయుడు, జయచంద్ర తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారిణులు

బాల్యవివాహ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పుట్టపర్తి సిడిపిఒ జయంతి సూచించారు. సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొడపగానిపల్లి ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం-నో బ్యాగ్ డే నిర్వహించారు. జయంతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చదువు ఆవశ్యకత, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సమాజం పట్ల బాధ్యతపై వివరించారు. హెచ్‌ఎం మంజుల వాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు బలమైన సమాజ నిర్మాణానికి గొడ్డలి పెట్టు అని, వాటిని నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిసిపిఒ స్టాఫ్ మురళీ, నోడల్ అధికారిని, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

కిశోరి బాలికలకు అవగాహన

ఓబుళదేవరచెరువు : మండలంలోని గౌనిపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం సమగ్ర అభివృద్ధిపై కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి మాట్లాడుతూ బాలికల్లో వచ్చే శారీరక, మానసిక మార్పులు, ఆరోగ్య సమస్యలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, రక్తహీనత, విద్య, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. బాలికలకు ఏమైనా సమస్యలు ఉంటే పేపర్‌పై రాసి ఫిర్యాదుల బాక్సులో వేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు షమీం, స్వర్ణ, పార్వతి, శ్యామల, వెంకటనరసమ్మ, ప్రమీల, సుకన్య, బాలికలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక డివిఅండ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లెక్చరర్లు మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసం పెంచుకుని లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు గ్రూప్ లీడర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ సునీత, లెక్చరర్ జ్యోతి, సుజాత, అంగన్వాడీ వర్కర్లు, వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్లు గీత, యామిని పాల్గొన్నారు.

మండల వడ్డెర సంఘం ఎన్నిక

ఓబుళదేవరచెరువు : స్థానిక ఐటిఐ కళాశాల ఆవరణలో శనివారం వడ్డెర్ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప, జిల్లా జనరల్ సెక్రటరీ పీట్ల సుధాకర్, అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జిరిపిటి వెంకటేష్, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, శివప్ప, కార్యదర్శి ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రమణప్ప, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలకు డిమాండ్

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న యశోద స్కూల్, జీవనజ్యోతి, కాకతీయ, ఐజి నిర్మల పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, శేషం మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఆర్డీవో కార్యాలయంలో ఏవో కతిజున్‌కుబ్రాకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా, అనుమతి లేకపోయినా హాస్టళ్లు నడుపుతున్నారని ఆరోపించారు. కావున ఆయా పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిచో దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిరణ్, గణేష్, నంద, తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షిద్దాం.. వన్యప్రాణులను సంరక్షిద్దాం

ప్రజాశక్తి-కదిరి టౌన్

'అడవుల రక్షణ.. మానవాళి మనుగడకు సంరక్షణ' అని అటవీ క్షేత్రాధికారి గుర్రప్ప పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో 'అడవుల రక్షణ-వన్యప్రాణుల సంరక్షణ' అంశంపై విద్యార్థులకు ఉపన్యాసాలు, క్విజ్ పోటీలు నిర్వహించి మొక్కలు పంపిణీ చేశారు. గుర్రప్ప మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. హెచ్‌ఎం లియాఖత్ అలి మాట్లాడుతూ కార్తీక మాసంలో వన మహోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అడవులు, మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దామోదర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, విథ్యార్థులు పాల్గొన్నారు.

నేడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

గోరంట్ల : పట్టణంలోని బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సవిత హాజరవుతారని వడ్డెర సంఘం నాయకులు తెలిపారు. కావున వడ్డెర కులస్తులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

రోడ్డు పనుల పరిశీలన


ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక దొరిగల్లు రోడ్డులో ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తూ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ విషయంపై ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు. ఆర్ అండ్ బి జెఈ వన్నూరుస్వామి, సిబ్బంది శనివారం ముదిగుబ్బకు వచ్చి ఆ రోడ్డును పరిశీలించారు. కొలతలు వేసి ప్యాచ్ వర్క్ పనులను త్వరలో చేయిస్తామని తెలిపారు.

ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు బహుమతులు

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలోల ప్రతిభ చాటిన విద్యార్థులకు శనివారం రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ చాలా ముఖ్యమన్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులకు చేయూతనిస్తూ ప్రోత్సహించడమే ట్రస్టు లక్ష్యం అన్నారు. క్రీడాకారులకు 30 గోల్డ్, 30 సిల్వర్, 30 బ్రాంజ్ మెడల్స్, 26 ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ ఎద్దులరాముడు, హెచ్‌ఎం, ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఫ్రెండ్స్ ట్రస్ట్ నిర్వాహకులు

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో గుడిపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. గుడిపల్లి గ్రామానికి చెందిన రవి, గంగరత్న సోమందేపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయల్దేరారు. ఈ క్రమంలో వారు జాతీయ రహదారిపై పాపిరెడ్డిపల్లి సమీపంలో గుడిపల్లి క్రాస్ వద్ద తిరగడానికి బైక్‌పై నిల్చొని ఉండగా అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్న కర్నాటకకు చెందిన ఓ కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగరత్న, రవి తీవ్రంగా గాయపడగా స్థానికుల సహాయంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.